డివైడర్ గాయబ్.. సెంట్రల్ లైటింగ్ ఔట్ !

- లైట్లు బిగించిన నాలుగు నెలలకే తొలగింపు
- నిధులు వృథా.. పెట్టాలంటే మళ్లీ టెండర్లు పిలవాల్సిందే
- ట్రాఫిక్‌తో వాహనదారుల ఇబ్బందులు
- బడంగ్‌పేట్ ప్రధాన రహదారిలో ఇదీ పరిస్థితి

సరూర్‌నగర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్‌లో రూ.7.50కోట్ల వ్యయంతో విస్తరించిన ప్రధాన రహదారిలో ప్రస్తుతం ఓ విచిత్ర పరిస్థితి నెలకొంది. రోడ్డు విస్తరించి, మధ్యలో డివైడర్ ఏర్పాటు చేసి.. ఆ తర్వాత మరో రూ.50లక్షలు వెచ్చించి సెంట్రల్ లైటింగ్ సైతం ఏర్పాటు చేశారు. కానీ ఇప్పుడు అక్కడ కొంత దూరం డివైడర్‌గానీ, సెంట్రల్ లైటింగ్ గానీ కనిపించని పరిస్థితి.! బడంగ్‌పేట్ మెయిన్ రోడ్డులో అల్మాస్‌గూడకు వెళ్లే చౌరస్తా నుంచి పాత గ్రామ పంచాయతీ కూడలి వరకు గతంలో నిర్మించిన డివైడర్, సెంట్రల్ లైటింగ్ మాయమైపోయాయి. ఎనిమిది నెలల పాటు డివైడర్, నాలుగు నెలల పాటు విద్యుత్ లైట్లు కనిపించగా.. ఆ తర్వాత ఆ రెండూ గాయబ్ కావడం గమనార్హం! నిత్యం వేలాది వాహనాలు తిరిగే ఈ రహదారిలో డివైడర్ తప్పనిసరి కాగా, ప్రస్తుతం డివైడర్ లేకపోవడంతో సదరు మెయిన్ రోడ్డులో వాహనాల రాకపోకలు అస్తవ్యస్తంగా మారింది.

ఓ సారి తొలగించి.. మళ్లీ నిర్మించి.. మరోసారి తొలగించి

బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని ఉద్యోగ్‌నగర్ కమాన్ నుంచి గాంధీనగర్ చౌరస్తా(పాలిటెక్నిక్ కాలేజీ) వరకు రహదారి విస్తరణకు రూ.7.50కోట్లు ఎల్‌ఆర్‌ఎస్ నిధులు మంజూరు కాగా, 2021 ఫిబ్రవరి 8న అప్పటి మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేశారు. బడంగ్‌పేట్ గ్రామానికి ఇరువైపులా రోడ్డు విస్తరణ సాఫీగానే సాగినప్పటికీ.. గ్రామం మధ్యలో మాత్రం అవరోధాలు ఎదురయ్యాయి. అనేక నివాస గృహాలు తొలగించాల్సి రావడంతో స్థానికులు ఆందోళనకు దిగారు. దాంతో విస్తరణ మాట పక్కనబెట్టి.. ఆ ప్రదేశంలో కేవలం డివైడర్ మాత్రమే నిర్మించారు. అనంతరం మొత్తం రహదారిలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయడానికి రూ.50లక్షలు కేటాయించి 2022 జూన్ 7వ తేదీన మేయర్ పారిజాతారెడ్డి, కార్పొరేటర్లు కలిసి శంకుస్థాన చేశారు. ఎట్టకేలకు రహదారి విస్తరణ చేపట్టకుండానే డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేసి మమ అనిపించుకున్నారు. కాగా మొదట్లో డివైడర్ నిర్మించిన కొన్నాళ్లకే వినాయక చవితి రావడంతో గణేశ్ నిమజ్జన శోభాయాత్రకు డివైడర్ అడ్డంకిగా మారిందంటూ 2022 సెప్టెంబరులో డివైడర్‌ను పూర్తిగా తొలగించేశారు. ఆ తర్వాత మళ్లీ డివైడర్ నిర్మించి సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయగా.. 2023లో గణేశ్ శోభాయాత్ర సందర్భంగా మరోసారి ఆ రెండింటినీ తొలగించేశారు. విద్యుత్ స్తం భాలు తొలగించి మునిసిపల్ భవనం ఎదురుగా గల ప్రజాభవన్ పక్కన పడేసి, వాటికి ఉన్న విద్యుత్ లైట్లను రోడ్డు పక్కన గల స్తంభాలకు బిగించారు. డివైడర్‌ను పూర్తిగా తొలగించి రోడ్డును మునిపటి లాగే చదునుగా మార్చేశారు. దాంతో ప్రస్తుతం అటు ఉద్యోగ్‌నగర్ నుంచి అల్మాస్‌గూడ చౌ రస్తా వరకు.. ఇటు గాంధీనగర్ నుంచి బడంగ్‌పేట్ పాత గ్రామ పంచాయతీ కూడలి వరకు మాత్రమే డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఉండగా.. మిగతా ప్రాం తంలో అవి రెండూ మాయమయ్యాయి.



2021 ఫిబ్రవరిలో రోడ్డు విస్తరణకు శంకుస్థాపన చేసిన సబితారెడ్డి తదితరులు(ఫైల్)



డివైడర్, సెంట్రల్ లైటింగ్ లేకుండా బోసిగా కనిపిస్తున్న బడంగ్‌పేట్ ప్రధాన రహదారి.. గతంలో సెంట్రల్ లైటింగ్ కోసం స్తంభం ఏర్పాటు చేసిన ప్రదేశం(సర్కిల్‌లో)



అప్పట్లో డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తో ఇలా..

వ్యాపార సంస్థల ఎదుట అక్రమ పార్కింగ్‌తో అవస్థలు

ఇక్కడ డివైడర్ తొలగింపుతో స్థానిక వ్యాపార సంస్థల ఎదుట అక్రమ పార్కింగ్ చేస్తున్నారు. దాంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. డివైడర్ ఉన్నప్పుడు షాపుల వద్ద అక్రమ పార్కింగ్‌కు అడ్డుకట్ట పడ్డదని, ఇప్పుడు ఎప్పటిలాగే అక్రమ పార్కింగ్‌తో రోడ్డంతా గందరగోళంగా మారిందని వాహనదారులు వాపోతున్నారు. ఈ దృష్ట్యా గతంలో నిర్మించి తొలగించిన ప్రదేశంలో మళ్లీ డివైడర్ నిర్మించి వెంటనే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మళ్లీ టెండర్ పిలవాల్సిందేనా ?

గతంలో మంజూరైన నిధులతో కాంట్రాక్టర్ పనులు చేయగా.. ఆ తర్వాత వాటి తొలగింపుతో అతడికి సంబంధం ఉండదని ఓ అధికారి పేర్కొన్నారు. దాంతో అక్కడ మళ్లీ డివైడర్ నిర్మించాలన్నా, దానిపై సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నా తాజాగా మళ్లీ టెండర్ పిలవక తప్పదని అంటున్నారు. ఒక రకంగా ఇది నిధుల దుర్వినియోగం కిందకే వస్తుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి ఏదో ఒక రకంగా అక్కడ డివైడర్ నిర్మాణంపై, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుపై దృష్టిపెట్టి సత్వర చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అవసరమైతే రహదారి విస్తరణకు గల అడ్డంకులను అధిగమించి నివాస గృహాల యజమానుల నుంచి సానుకూల అభిప్రాయం వచ్చేలా చూడాలని సూచిస్తున్నారు.



2022, మేలో సెంట్రల్ లైటింగ్ పనులు ప్రారంభిస్తున్న మేయర్, కార్పొరేటర్లు(ఫైల్)



డీజే మ్యూజిక్ సిస్టంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలి

- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి సూచించారు. హయత్‌నగర్ ఇన్ఫర్మేషన్ కాలనీకి చెందిన సందీప్‌రెడ్డి ఏర్పాటు చేసిన డీజే మ్యూజిక్ సిస్టంను ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసమని వేచి చూడకుండా తమకున్న నైపుణ్యం ఆధారంగా స్వయం ఉపాధి పథకాలను చేపట్టి వృద్ధిలోకి రావాలన్నారు.



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి, కార్పొరేటర్ శోభారెడ్డి

అభివృద్ధి పనుల్లో జాప్యం లేకుండా చూడాలి

- అధికారులకు మేయర్ పారిజాతారెడ్డి సూచన

సరూర్‌నగర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో కోట్లాది రూపాయల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగకుండా చూడాలని అధికారులకు, కాంట్రాక్టర్లకు మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి సూచించారు. బడంగ్‌పేట్ 29వ డివిజన్‌లోని రామిడి చంద్రారెడ్డినగర్, ఆంజనేయ టవర్స్‌లో కొత్తగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు శుక్రవారం కార్పొరేటర్ పెద్దబావి శోభాఆనంద్‌రెడ్డితో కలిసి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పారిజాతారెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో జాప్యం జరిగితే ప్రజలు ఇబ్బందులకు గురవుతారని, ఈ దృష్ట్యా సదరు పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పెద్దబావి శ్రీనివాస్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నాయకులు భీమిడి చంద్రపాల్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, ఆయా కాలనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

ఎల్బీనగర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రంగారెడ్డి జిల్లా 6వ మహాసభలను జయప్రదం చేయాలని ఫెడరేషన్ సరూర్‌నగర్ మండల అధ్యక్షుడు రామావత్ తావూరియానాయక్ పిలుపునిచ్చారు. శుక్రవారం సరూర్‌నగర్‌లో ఆయన మాట్లాడుతూ డిసెంబరు 14, 15తేదీలలో షాద్‌నగర్ పట్టణంలో నిర్వహించనున్న ఈ మహాసభలకు ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ప్రొఫెసర్ నాగేశ్వర్, రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావా రవి, జిల్లా అధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి వెంకటప్ప తదితరులు పాల్గొననున్నారని ఆయన పేర్కొన్నారు. సరూర్‌నగర్ మండలం నుంచి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తావూరియా నాయక్, ప్రధాన కార్యదర్శి రాజు కోరారు.

పోలింగ్ కేంద్రాలను ఒకేచోట ఏర్పాటు చేయండి

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అబ్దుల్లాపూర్‌మెట్‌కు సంబంధించిన అన్ని పోలింగ్ కేంద్రాలను ఒకే చోట ఏర్పాటు చేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు గుండె రవీందర్ శుక్రవారం ఎంపీడీవో శ్రీవాణికి వినతిపత్రం అందజేశారు. గతంలో మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో అన్ని బూతులను ఏర్పాటు చేసేవారని ఎంపీడీవోకి వివరించారు. ప్రస్తుతం నాలుగు బూతులను మరోచోట పెట్టనున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. దాంతో ఓటర్లు ఇబ్బందిపడే అవకాశాలు ఉంటాయని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలను ఒకేచోట ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

16నుంచి ధనుర్మాస మహోత్సవాలు

మన్సూరాబాద్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్ విజయశ్రీకాలనీలోని పద్మావతి గోదాసమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 16 నుంచి వచ్చే ఏడాది 2025, జనవరి 14వ తేదీ వరకు గోదా రంగనాథస్వామి ధనుర్మాస మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ, విజయశ్రీకాలనీ సంక్షేమ సంఘం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ఉత్సవాల్లో భాగంగా ప్రతి నిత్యం ఉదయం 5.30గంటలకు అర్చన, తిరుప్పావై సేవాకాలం ఉంటుందన్నారు. అదేవిధంగా 2025, జనవరి 2న తిరునక్షత్రం, శ్రవణానక్షత్రం సందర్భంగా మాసకల్యాణం, 10న వైకుంఠ(ముక్కోటి) ఏకాదశి, 11న కూడారై ఉత్సవం, 108 గంగాళములతో స్వామివారికి పాయస నివేదన, 12న నీంరాట్టోత్సవం, గోదాదేవికి అభిషేకంతో పాటు పెళ్లి కూతురు చేయుట, 13న గోదాదేవి, రంగనాయక స్వామివార్ల కల్యాణోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది. 29రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు భక్తులు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

నేటినుంచి ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన

ఓల్డ్‌మలక్‌పేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రక్రియ జీహెచ్ఎంసీలో ప్రారంభమైంది. అందులో భాగంగా శనివారం నుంచి దరఖాస్తుల పరిశీలన జరుగుతుందని మలక్‌పేట సర్కిల్ డీసీ జయంత్ తెలిపారు. గతంలో నిర్వహించిన ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇంటి వద్దకు అధికారులు, సిబ్బంది స్వయంగా వెళ్లి దరఖాస్తులను పరిశీలించనున్నారు. దరఖాస్తుల పరిశీలన ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతుంది. అనంతరం అర్హులైన లబ్ధిదారుల జాబితాను ప్రభుత్వం ప్రకటిస్తుంది. మలక్‌పేట నియోజకవర్గానికి మొదటి విడత 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరైనట్లు అధికారులు చెబుతున్నారు. ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారు ఇంటి వద్దకు వచ్చిన అధికారులకు, సిబ్బందికి సహకరించాలని డీసీ కోరారు.

మార్కెట్ సిబ్బందికి గ్రీన్ డ్రెస్‌కోడ్



మార్కెట్‌లో గ్రీన్ డ్రెస్‌కోడ్‌తో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది

ఓల్డ్‌మలక్‌పేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో సిబ్బందికి డ్రెస్‌కోడ్ అమలు చేస్తున్నారు. రైతులు మార్కెట్ సిబ్బందిని గుర్తించడంలో ఇబ్బందులు ఎదురుకాకుండా ఉండేందుకు డ్రెస్‌కోడ్ పెట్టినట్లు మార్కెట్ గ్రేడ్‌వన్ సెక్రెటరీ చిలుక నర్సింహారెడ్డి తెలిపారు. వ్యవసాయ మార్కెట్‌కు ధాన్యం అమ్ముకునేందుకు వచ్చే రైతులు మార్కెట్ సిబ్బందిని వెంటనే సులువుగా గుర్తించే విధంగా గ్రీన్‌కలర్ టీషర్టులు ధరిస్తున్నారు. మర్కెట్‌కు పెద్ద ఎత్తున ధాన్యం వస్తున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సిబ్బంది అందుబాటులో ఉండేవిధంగా చర్యలు చేపట్టారు. మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో ప్రస్తుతం ఉల్లి, ఎండు మిర్చి కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. మిర్చి తేజ రకం క్వింటా ధర రూ.15,000 అమ్ముడుపోతుండగా, ఉల్లి క్వింటా రూ.5100 పలుకుతుంది.



ప్రశంసాపత్రాలను అందజేస్తున్న అసోసియేషన్ అధ్యక్షుడు రూపేష్ గణిత

రిఫరీలు, న్యాయమూర్తులకు ప్రశంసాపత్రాల అందజేత

చాదర్‌ఘాట్ : అసోసియేషన్ ఆఫ్ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ తెలంగాణ రాష్ట్ర రిఫరీ, న్యాయమూర్తులను అసోసియేషన్ అధ్యక్షుడు రూపేష్ గణిత అభినందించారు. ఇటీవల జరిగిన రిఫరీలు, న్యాయమూర్తుల సెమినార్ పరీక్షల్లో ఎంపికైన రిఫరీలు, న్యాయమూర్తులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. ఎగ్జామినర్లుగా మనీష్‌కుమార్, మహదేవ్ రొట్టె, ఆదిమూల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

- అర్హులకు అన్యాయం జరుగకుండా చూడాలి
- మీర్‌పేట్ మేయర్ దుర్గాదీప్‌లాల్ సూచన



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ దుర్గ

సరూర్‌నగర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చేందుకు చేపడుతున్న సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, సిబ్బంది సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మీర్‌పేట్ కార్పొరేషన్ మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ సూచించారు. ఈనెల 16వ తేదీ నుంచి నిర్వహించనున్న సర్వే నేపథ్యంలో శుక్రవారం మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గ మాట్లాడుతూ ఎంతో మంది పేదలు సొంతిళ్లు లేక అద్దె ఇళ్లలో కాలం గడుపుతున్నారని, అలాంటి వారికి ఇందిరమ్మ ఇళ్లు దక్కేలా చూడాల్సిన బాధ్యత సర్వే సిబ్బందిపై, ప్రభుత్వంపై ఉన్నదని అన్నారు. అర్హులకు అన్యాయం జరుగకుండా సర్వే ఉండాలని, ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లోని అంశాల ఆధారంగా సర్వే సమగ్రంగా చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, డీఈఈ వెంకన్న, మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఆర్వో చంద్రశేఖర్‌రెడ్డి, మెప్మా ఇన్‌చార్జి లక్ష్మయ్య, నర్సింహ, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హయత్‌నగర్ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు



ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్య గైడెన్స్ అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు

హయత్‌నగర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం డిపార్టుమెంట్ ఆఫ్ ఇంగ్లిష్, తెలుగు స్కిల్ నాలెడ్జ్ సెంటర్, కెరీర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్య గైడెన్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇంటర్ నేషనల్ అకాడమీ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్‌కు చెందిన మహిత హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఉన్నత చదువులు, ఉద్యోగ అవకాశాలకు ఏవిధంగా చదువుకోవాలో వివరించారు. డిగ్రీ పూర్తైన విద్యార్థులు ఉద్యోగానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఎలాంటి పుస్తకాలు చదువుకోవాలో తెలిపారు. అదేవిధంగా ఇంటర్వ్యూకు సంబంధించిన వివిధ రకాల నైపుణ్యాలను వివరించారు. భవిష్యత్తులో మంచి ఉద్యోగాలను పొందడానికి సరైన నైపుణ్యాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, తెలంగాణ స్కిల్ నాలెడ్జ్ సెంటర్ కో-ఆర్డినేటర్ మక్క, అకాడమిక్ కో-ఆర్డినేటర్ నర్సింహ, అధ్యాపకులు విద్యాసాగర్, ఆనందం దుర్గాప్రసాద్, కృష్ణమోహన్, నక్క నర్సింహ, యాదగిరిరెడ్డి, మల్లేశం పాల్గొన్నారు.

కరెంటు సౌకర్యం కల్పించండి



ఏడీ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

హయత్‌నగర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ రాగన్నగూడలోని జేఎన్ఎన్‌యూఆర్ఎంకాలనీ ఫేజ్-1లో కరెంటులేక పలు కుటుంబాలు ఇబ్బందిపడుతున్నాయని, అర్హులైన ప్రతి కుటుంబానికి కరెంటు మీటరు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖ ఏడీ శ్రీనివాస్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు డి. కిషన్ మాట్లాడుతూ రాగన్నగూడ వార్డు -7లో గల జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ ఫేజ్-1లో అనేక కుటుంబాలు నివసిస్తున్నాయని తెలిపారు. కరెంటు సౌకర్యం లేక అంధకారంలో ఉంటున్నారని తెలిపారు. అధికారులు సర్వేచేసి అర్హులైన ప్రతి కుటుంబానికి విద్యుత్ మీటర్ సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, ఆశీర్వాదం, పల్లె కృష్ణ, యాదగిరి, శివప్రసాద్, కాశీ, నర్సింహ, రవికుమార్, రవినాయక్, దేశ్యానాయక్ పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ బకాయిలను విడుదల చేయాలి

- తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య



సమావేశంలో మాట్లాడుతున్న పైళ్ల ఆశయ్య

వనస్థలిపురం, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఉచిత విద్యుత్ బకాయిలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య అన్నారు. శుక్రవారం వనస్థలిపురంలో సంఘం నాయకులు భూసరాజు కాశయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర కార్యదర్శి పైళ్ల ఆశయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉచిత విద్యుత్ బకాయిలను ప్రభుత్వం ప్రతి నెల చెల్లించకపోవడం మూలంగా పెండింగ్ బిల్లులు వృత్తిదారులే చెల్లించాలని విద్యుత్ అధికారులు అనేక చోట్ల విద్యుత్ కనెక్షన్లు తొలగిస్తామని బెదిరిస్తూ కొన్ని చోట్ల కనెక్షన్లు తొలగించడం సహించరానిదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడీ నిధిని విద్యుత్ శాఖకు చెల్లించి రజక వృత్తికి ఆటంకాలు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో రజక వృత్తి దారులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సీ.మల్లేష్, నాయకులు రేవల్లి నరేష్, శేఖర్, బాలరాజు, చంద్రకళ, అబ్బయ్య, అంజయ్య, శ్రీశైలం, బాలయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలతో ప్రమాదాల నివారణ : ఇన్‌స్పెక్టర్



సైనేజీ బోర్డులపై ఉన్న నిబంధనలను వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ అర్జున్

కొత్తపేట, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణ సాధ్యమేనని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇన్‌స్టిట్యూట్(టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ అన్నారు. శుక్రవారం జిల్లెలగూడ, ఘట్‌కేసర్‌లోని లార్డ్స్ ట్యాలెంట్‌స్కూల్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్స్‌లో చదివే 152 మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. టీటీఐ సిబ్బంది వారికి సైనేజీ బోర్డుల్లోని నిబంధనల చిత్రాలను చూపించారు. వాహనాలను నడపడంలో జాగ్రత్తలను, పాటించాల్సిన ట్రాఫిక్ నిబంధనలను వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ అర్జున్ మాట్లాడుతూ జిల్లెలగూడ, ఘట్‌కేసర్, బడంగ్‌పేట, ఎల్బీనగర్, నాగోల్ చాణిక్యపురి కాలనీల్లోని విద్యాసంస్థల విద్యార్థులకు, సరూర్‌నగర్ హుడాకాలనీ, ఎంఆర్‌ఓ కార్యాలయ ప్రాంతాల్లో ప్రజలకూ టీటీఐ సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారన్నారు.

17 కార్యక్రమాల్లో 814 మంది విద్యార్థులకు అవగాహన

వివిధ విద్యాసంస్థలలో 17 కార్యక్రమాల్లో 814 మంది విద్యార్థులకు, ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారని ఇన్‌స్పెక్టర్ అర్జున్ తెలిపారు. టీటీఐ లెక్చర్ హాల్‌లో 5 డీడీ కౌన్సెలింగ్ సెషన్స్‌లో 106మంది పలు ప్రాంతాల్లో మద్యంతాగి వాహనాలు నడుపుతూ డీడీ పరీక్షల్లో పట్టుబడిన వారు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో టీటీఐ విశ్రాంత ఇన్‌స్పెక్టర్ అమరవర్ధన్‌రెడ్డి, ఏఎస్ఐ సోమ్‌నాథ్, రామారావు, సేఫ్టీట్రెయినర్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

మిధానీ ఎన్నికల్లో ఎండబ్ల్యూఎస్‌యూ ఘన విజయం



ఎన్నికల్లో విజయం సాధించిన మిధానీ వర్కర్స్ అండ్ స్టాఫ్ యూనియన్ అధ్యక్షుడు శ్రీహరి తదితరులు

చంపాపేట, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కంచన్‌బాగ్‌లోని కేంద్ర ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ మిశ్ర ధాతు నిగమ్(మిధానీ)లో శుక్రవారం జరిగిన యూనియన్ ఎన్నికల్లో మిధానీ వర్కర్స్ అండ్ స్టాఫ్ యూనియన్ తరఫున గులాబీ పువ్వు గుర్తుపై పోటీచేసిన శ్రీహరి 22 ఓట్ల తేడాతో ఘన విజయం సాధించారు. ఎన్నికల్లో గులాబీ పువ్వు గుర్తుకు 205ఓట్లు, మిధానీ ఎంప్లాయీస్ యూనియన్ అభ్యర్థిగా పులి గుర్తుపై పోటీచేసిన నారాయణరావుకు 183ఓట్లు, మిధానీ మజ్దూర్ సంఘ్ అభ్యర్థిగా సూర్యుని గుర్తుపై పోటీ చేసిన సురేష్‌రెడ్డికి 117ఓట్లు రాగా 2 చెల్లని ఓట్లు పోలైనాయి. ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఘన విజయం సాధించిన బి.శ్రీహరిని యూనియన్ నాయకులు అభినందించారు. అనంతరం విజయోత్సవాలను జరుపుకున్నారు.

కేవీ రంగారెడ్డికి ఘన నివాళి

రంగారెడ్డి జిల్లా కోర్టులు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ ఉప ముఖ్యమంత్రి, ప్రముఖ న్యాయవాది కేవీ రంగారెడ్డికి రంగారెడ్డి జిల్లా కోర్టులో న్యాయవాదులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో రంగారెడ్డి కోర్టుల బార్ అసోసియేషన్ కార్యదర్శి జి. కృష్ణ, పులిగారి గోవర్ధన్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మీనాక్షి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధులకు ఆటంకం కలిగించిన వారిపై కేసు నమోదు

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పంచాయతీ సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వారిపై అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గండిచెరువు గ్రామ పంచాయతీలో బండారి కుమార్ బిల్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గురువారం రాత్రి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 188 నుంచి 195లోని వివాదస్పద స్థలంలో బోరు వేస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డికి ఫిర్యాదు అందింది. దాంతో సెక్రెటరీ బోరును ఆపివేయించాలని కుమార్‌కు సూచించారు. వాటర్‌మెట్ గిరీష్, కుమార్ ఇద్దరు కలిసి అక్కడికి వెళ్లారు. బోరు నిలిపివేయాలని వారికి సూచించారు. అక్కడే ఉన్న జక్క పాపిరెడ్డి, ధీరజ్‌రెడ్డి పంచాయతీ సిబ్బందిని ఎందుకు వచ్చారని దూషిస్తూ కుమార్ చొక్కాను చింపేశారు. విధుల్లో ఉన్న తమపై దాడిచేసి విధులకు ఆటంకం కలిగించారని శుక్రవారం కుమార్ అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.